నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, గురువారం 18 ఏప్రిల్ 2024 | RANGAREDDY




## నేడు హెరిటేజ్ వాక్

### జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : ప్రపంచ హెరిటేజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జరిగే హెరిటేజ్ వాక్‌ను విజయవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ కోరారు. గురువారం ఉదయం 7 గంటలకు దారుల్‌షిఫా నుంచి ప్రారంభమై సాలర్‌జంగ్ మ్యూజియం మీదుగా ఉస్మానియా ఆసుపత్రి వద్ద ఈ వాక్ ముగుస్తుందన్నారు. తాగునీరు, షామియానా వంటి ఏర్పాట్లు చేయాలని ఖైరతాబాద్, చార్మినార్ జోనల్ కమిషనర్‌లకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ఆసక్తి గలవారు పాల్గొనాలని పేర్కొన్నారు.

## ఇంటిల్లిపాదికి ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలన్న లక్ష్యంతో ఓటరు ప్రక్రియను జీహెచ్ఎంసీ సమూల ప్రక్షాళన చేపట్టింది. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత డూప్లికేట్ ఓట్లు, ఒకే వ్యక్తికి వేర్వేరుగా రెండు ఓటరు కార్డులు ఉండటం, ఒకే కుటుంబంలో వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయాల్సి రావడం, ముఖ్యంగా డూప్లికేట్ ఓట్లపై అన్ని రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన అనుభవాల దృష్ట్యా అధికారులు తప్పులు పునరావృతం కాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టారు. పోలింగ్ బూత్‌ల వారీగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. అడ్రస్ మారిన ఓటరు.. కొత్త స్థానంలో ఓటరు కార్డు పొంది, పాత స్థానంలో కొనసాగుతున్న వాటి వివరాలను సేకరించారు. ఈ మేరకు జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,81,405 మంది ఇళ్లు మారినట్లు గుర్తించి వారికి ఒకే చోట ఓటరు కార్డు ఉండేలా చర్యలు తీసుకున్నారు. వీటితో పాటు ప్రధానంగా ఒకే కుటుంబంలో ఉండే వారికి వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు కల్పించడం పై అధికారుల వైఫల్యాలను గత ఎన్నికల్లో సోషల్ మీడియా వేదికగా ఎత్తిచూపారు. దీంతో ఈ సారి అలా జరుగకుండా ఇంటిల్లిపాది ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేసేలా చర్యలు తీసుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయం నాటికి 3,60,849 ఓటర్లను సరిచేయగా..డిసెంబర్ నుంచి మార్చి నాటికి 17,864 ఓటర్లను సరిచేశారు.



షాబాద్ మండలం సీతారాంపూర్‌లో..



షాదర్‌నగర్ పట్టణంలో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

## కల్యాణ వైభోగమే..

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

వాడవాడలా పందిర్లు వేసి సీతారాముల కల్యాణం

జరిపించిన వేదపండితులు

భక్తులతో కిక్కిరిసిన దేవాలయాలు

**ఉమ్మడి జిల్లా ప్రజలు** బుధవారం శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఆలయాల్లో, వాడవాడలా చలువ పందిర్లు వేసి సీతారాముల కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య జరిగిన స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు సీతారాములకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయాల కమిటీలు, ఆయా సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

## శివార్లలోనే విద్యుత్ కనెక్షన్లకు డిమాండు

గ్రేటర్‌లో 9 సర్కిళ్లలో

60.80 లక్షల దాటిన విద్యుత్ కనెక్షన్లు

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): నగర శివారు ప్రాంతాల్లో పట్టణీకరణ వేగంగా పెరుగుతోంది. నగరం నలువైపులా ఎటుచూసినా గృహ నిర్మాణ, వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు గణనీయంగా పెరుగుతున్నది. శివారు ప్రాంతాల్లో భారీగా పెరుగుతున్న కొత్త విద్యుత్ కనెక్షన్ల సంఖ్య అందుకు నిదర్శనం. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్‌పీడీసీఎల్) పరిధిలో మొత్తం 21 సర్కిళ్లు ఉండగా, అందులో 9 సర్కిళ్లు గ్రేటర్ పరిధిలోనే ఉన్నాయి. శివారు ప్రాంతాల్లోని సర్కిళ్లు.. హబ్సిగూడ, సరూర్‌నగర్, మేడ్చల్, రాజేంద్రనగర్, సైబర్ సిటీ సర్కిళ్లలో 8.70లక్షల నుంచి 6.70లక్షల దాకా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మిగతా నాలుగు సర్కిళ్లలో కేవలం 4 లక్షల వరకే ఉన్నాయి. ఏటా కొత్త విద్యుత్ కనెక్షన్ల సంఖ్యలో నగర శివారు ప్రాంతాలైన హబ్సిగూడ, సరూర్‌నగర్, మేడ్చల్, రాజేంద్రనగర్, సైబర్ సిటీలోనే గణనీయంగా పెరుగుతున్నాయి. .

### పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు..

గతేడాది మేలో ఉండే విద్యుత్ డిమాండు ఈసారి మార్చిలోనే నమోదైంది. 2023లో మే 19న అత్యధికంగా 79.33 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం నమోదైతే, ఈ ఏడాది వేసవిలో ఏప్రిల్ 4న అత్యధికంగా రికార్డు స్థాయిలో 83.84 మిలియన్ యూనిట్లు నమోదైంది. ఇలా ఊహించని రీతిలో విద్యుత్ డిమాండు పెరిగినా సరఫరా చేసేంత నెట్‌వర్క్‌ను గత కేసీఆర్ ప్రభుత్వం డిస్కం పరిధిలోని అన్ని సర్కిళ్లలోనూ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం రోజు వారీగా సబ్ స్టేషన్‌లు, డీటీఆర్( డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్)పై ఉండే లోడును గమనిస్తూ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించే పనిలో విద్యుత్ శాఖ నిమగ్నమై ఉంది. ఐటీ కారిడార్ పరిధిలోకి వచ్చే సైబర్ సిటీ సర్కిల్‌లో వేసవి కార్యాచరణలో భాగంగా మొత్తం 5 చోట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్‌ను ఏర్పాటు చేశామని సర్కిల్ ఎస్ఈ వెంకన్న తెలిపారు.

# నేటి నుంచే నామినేషన్లు

నేడు నోటిఫికేషన్ విడుదల చేయనున్న ఎన్నికల సంఘం

ఉదయం 11 గంటల నుంచే నామినేషన్ల స్వీకరణ షురూ..

ఈ నెల 25 వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల దాకా స్వీకరణ

26న స్క్రూట్నీ.. 29 వరకు నామినేషన్ల ఉప సంహరణ

మే 13న పోలింగ్.. జూన్ 4న కౌంటింగ్

చేవెళ్ల పార్లమెంటుకు రాజేంద్రనగర్ ఆర్వో కార్యాలయంలో నామినేషన్ల దాఖలుకు ఏర్పాట్లు

నామినేషన్ల స్వీకరణ కేంద్రం నుంచి 100మీటర్ల వరకు ఆంక్షలు

ముహూర్తం వేటలో అభ్యర్థులు



రంగారెడ్డి, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల పర్వం గురువారం నుంచి ప్రారంభమవుతున్నది. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల పార్లమెంటు స్థానానికి సంబంధించి రాజేంద్ర నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆర్వో కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమవుతున్న నామినేషన్ల ప్రక్రియ 25వ తేదీ వరకు ఆదివారం మినహా అన్ని రోజుల్లో కొనసాగనున్నది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి నామినేషన్లను స్వీకరిస్తారు. 26న నామినేషన్ల పరిశీలన.. 29న ఉపసంహరణ.. మే 13న పోలింగ్.. జూన్ 4న కౌంటింగ్‌తో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగియనున్నది. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లాలో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు.

### నామినేషన్ కేంద్రం వద్ద నిషేధాజ్ఞలు..

జిల్లాలో లోక్‌సభ ఎన్నికలకు అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తున్నది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ అధికారులకు శిక్షణ వంటి ప్రక్రియలను చేపట్టారు. చేవెళ్ల పార్లమెంటు పరిధిలో మొత్తం 29,28,186 మంది ఓటర్లు ఉండగా.. ఎన్నికల నిర్వహణకు 2,877 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. 13,443 మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల్లో విధులు నిర్వర్తించనున్నారు. అలాగే ఎన్నికల పర్యవేక్షణ కోసం 259 మంది సెక్టోరియల్ అధికారులను నియమించారు. లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ గత నెల 16న వెలువడగా.. నోటిఫికేషన్ విడుదలవుతున్న గురువారం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. నామినేషన్ల స్వీకరించే రాజేంద్ర నగర్ ఆర్వో కార్యాలయంలో అకౌంటింగ్ టీం, వీవీటీ టీం, సీ విజిల్, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ సీసీ కెమెరాల్లో నిక్షిప్తం కానున్నది.

అలాగే నామినేషన్ల వివరాలను ఎప్పటికప్పుడు ఎన్‌కోర్ అనే ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రానికి 200మీటర్ల వరకు ఆంక్షలు విధించారు. వాహనాలేవీ 200 మీ. దాటి లోపలకు రాకూడదు. దరఖాస్తు సమయంలో ఐదుగురికి మాత్రమే అవకాశాన్ని కల్పించారు. అంటే.. అభ్యర్థితోపాటు మరో నలుగురికి మాత్రమే వెళ్లొచ్చు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు.

### ముహూర్తం చూసుకుంటున్న అభ్యర్థులు..

ముహూర్తాలు చూసుకుని నామినేషన్లను దాఖలు చేసేందుకు వివిధ పార్టీలకు చెందిన ఎంపీ అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 21న ఆదివారం పోను.. ఏడు రోజుల సమయం ఉంది. ఈ ఏడు రోజుల్లో తమకు కలిసొచ్చే రోజు కోసం అభ్యర్థులు పండితుల సలహాలు తీసుకుంటున్నారు. పేరు, నక్షత్రాన్ని బట్టి మంచి తేదీ చూసుకుని నామినేషన్లను దాఖలు చేయనున్నారు. ఈ నెల 18, 19, 21, 23, 24 తేదీల్లో ముహూర్తం బాగుందని పండితులు చెబుతున్నారు. 21న ఆదివారం కావడంతో మిగిలిన నాలుగు రోజుల్లో ఎక్కువగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఏ పార్టీ కూడా ఇప్పటివరకు అభ్యర్థులకు ఇంకా బీ-ఫామ్‌లు ఇవ్వలేదు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ చేవెళ్ల ఎంపీ స్థానానికి అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌ను ప్రకటించారు. గురువారం తెలంగాణ భవన్‌లో జరిగే పార్టీ సమావేశంలో బీ-ఫామ్‌ను అందజేయనున్నారు. ఇప్పటికే ఆయన ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అదే ఊపుతో మంచి ముహూర్తం చూసుకుని నామినేషన్ వేసేందుకు కాసాని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



తల్లిదండ్రులు శశికళ బాబయ్యలతో తరుణ్

## పేదింట విరిసిన విద్యా కుసుమాలు

నిరుపేద కుటుంబంలో పుట్టి సరస్వతి పుత్రులుగా నిలిచారు.. చిన్నప్పటి నుంచే ఏదో సాధించాలన్న తపన.. చదువుపై ఉన్న మక్కువ వారిని ఉన్నత స్థాయిలో నిలబెట్టింది. స్కూల్ నుంచే సివిల్స్‌పై దృష్టించిన వారు పట్టుదలతో తాజాగా విడుదలైన యూపీఎస్సీ ఫలితాల్లో ఆలిండియా ర్యాంకులు సాధించి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు పూడూరు, పెద్దేముల్ మండలాలకు చెందిన తరుణ్, అష్ఫక్.

**తరుణ్ తల్లిదండ్రులు కూలీపని చేసి జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబంలో పుట్టిన అతను ఎలాగైనా పై చదువులు చదివి మంచి పొజిషన్‌లో ఉండాలనుకున్నాడు. అందుకోసం అలుపెరగకుండా ఏకాగ్రతతో చదువుపై దృష్టి పెట్టాడు. ఎన్ని అవరోధాలు ఎదురైనా వాటిని అధిగమిస్తూ మొదటి ప్రయత్నంలోనే ఏకంగా జాతీయ స్థాయిలో 231 ర్యాంకు సాధించి ఔరా అనిపించాడు. అలాగే అష్ఫక్ పదోతరగతి నుంచే సివిల్స్ సాధించి కలెక్టర్ కానీ, ఎస్పీ కానీ కావాలని అనుకున్నాడు. ఆ దిశగా పట్టుదలతో చదివిన అతను సివిల్స్ సాధించాడు. ప్రతి రోజూ 8-10 గంటలు చదువుతూ.. పలుమార్లు పరీక్షలు రాసినా విజయం వరించలేదు.. అయినా నిరుత్సాహ పడకుండా మరింత పట్టుదలతో చదివి నాలుగోసారి ప్రయత్నించి సక్సెస్ అయ్యాడు.**

### మొదటిసారి పరీక్ష రాసి.. 231 ర్యాంకు సాధించి..

పూడూరు,ఏప్రిల్ 17 : తల్లిదండ్రులు కూలీ పని చేసి జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబంలో పుట్టిన బిడ్డ ఎన్ని అవరోధాలు ఎదురైనా వాటిని అధిగమిస్తూ మొదటిసారి యూపీఎస్సీ పరీక్ష రాసిన తరుణ్ ఏకంగా జాతీయ స్థాయిలో 231 ర్యాంకు సాధించారు. తద్వారా జిల్లా నుంచి ఈసారి ఐఏఎస్ ర్యాంకు సాధించిన ఘనతను దక్కించుకున్నారు. కళాశాల లెక్చరర్ల సూచనలు, యూట్యూబ్ పాఠాలు, స్నేహితులతో పరీక్షలపై చర్చలతోనే జాతీయ ర్యాంకు సాధించానని పూడూరు మండల పరిధిలోని మంచన్‌పల్లి గ్రామానికి చెందిన డి.తరుణ్ తెలిపారు. తరుణ్ తల్లిదండ్రులు దయ్యాల శశికళ, బాబయ్యలకు ఇద్దరు పిల్లలు. వారిలో మొదటి సంతానం తరుణ్ చిన్ననాటి నుంచే చదువులో ముందుండేవాడు. తండ్రి బాబయ్య ప్రోత్సాహంతో హైదరాబాద్‌లోని పబ్లిక్ స్కూల్ అడ్మిషన్ కోసం ప్రవేశ పరీక్ష రాసి ఉత్తీర్ణుడై ఎంపికయ్యాడు. అదే స్కూల్‌లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యను అభ్యసించాడు. అనంతరం రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని వీజేఐటీ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. సీఎస్‌బీలో సివిల్ కోచింగ్‌కు వెళ్లిన తరుణ్ మొదటి ప్రయత్నంలోనే ఐఏఎస్ సాధించారు. సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ మాజీ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తనకు మోటివేషన్ అని, తాను 8వ తరగతిలో ఉన్నప్పుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తమ స్కూల్‌కు వచ్చారని, ఆయనను చూసి ఐపీఎస్ కావాలని మొదట నిర్ణయించుకున్నానని తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తయినప్పటి నుంచే ప్రిపరేషన్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బీటెక్ చదువుతున్న సందర్భంలో కరోనా లాక్‌డౌన్‌తో తాను ప్రతిరోజూ 5 నుంచి ఆరు గంటలపాటు చదివేవాడినని చెప్పారు. ఐఏఎస్ కావాలని మొదట తన బాబాయ్‌కు చెప్పగా ఆయన తనను ప్రోత్సహించారని పేర్కొన్నారు. ఐఏఎస్ సాధించిన తరుణ్ తల్లిదండ్రులు శశికళ బాబయ్యలు గ్రామంలో ఉన్న 30 గుంటల భూమిని సాగు చేసుకుంటూ రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమకు ఎక్కువగా భూమి లేకపోవడంతో ఎలాగైనా ఉన్నత చదువులు చదువాలని నిర్ణయించుకున్నట్లు తరుణ్ చెప్పారు. ఐఏఎస్‌కు ఎంపికైన తరుణ్ బాలికా విద్యపై మొదట దృష్టి సారిస్తానని తెలిపారు. పేదలకు వైద్య సదుపాయాలు అంశాలపై ప్రత్యేక దృష్టి పెడుతానని ఆయన పేర్కొన్నారు. యూపీఎస్సీలో జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించిన దళిత నిరుపేద కుటుంబానికి చెందిన తరుణ్‌ని పరిగి శాసనసభ్యుడు టి.రామ్మోహన్‌రెడ్డి, మాజీ శాసనసభ్యుడు కొప్పుల మహేశ్ రెడ్డిలతో పాటు పలువురు రాజకీయ నాయకులు, బంధువులు, స్నేహితులు సన్మానించి అభినందించారు.

### పట్టుబట్టి.. అనుకున్నది సాధించిన గొట్లపల్లి బిడ్డ..

పెద్దేముల్, ఏప్రిల్ 17 :తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ జాఫర్, రిజ్వానా బేగం దంపతులకు ఇద్దరు సంతానం. వీళ్లది నిరుపేద కుటుంబం. సుమారు 30 ఏండ్ల క్రితం గొట్లపల్లి నుంచి హైదరాబాద్‌కు వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. వీరి కుమారుడు మహ్మద్ అష్ఫక్‌ను ఉన్నత చదువులు చదివించగా అష్ఫక్ కష్టపడి చదివి ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో సత్తాచాటారు. దీంతో గ్రామస్తులందరూ ఫోన్ ద్వారా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందిస్తున్నారు. మహ్మద్ అష్ఫక్ హైదరాబాద్‌లోని హఫీజ్‌పేటలో జనప్రియ హైస్కూల్‌లో 10వ తరగతిని 2015వ సంవత్సరంలో పూర్తిచేశాడు. తదుపరి బాచుపల్లిల్లోని శ్రీ చైతన్య ఐఏఎస్ అకాడమీలో ఇంటర్మీడియట్‌ను 2017వ సంవత్సరంలో పూర్తిచేశాడు. అనంతరం న్యూఢిల్లీలోని శ్రీ రామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో (బీఏ-ఎకనామిక్స్, హానర్స్)ను 2020వ సంవత్సరంలో, న్యూఢిల్లీలోని ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో (ఎంఏ-ఎకనామిక్స్) పీజీని 2022వ సంవత్సరంలో పూర్తిచేశాడు. డిగ్రీ పూర్తి చేసిన తరువాత 2020వ సంవత్సరంలో మొదటి సారిగా సివిల్స్ పరీక్షను రాయగా సెలెక్ట్ కాలేదు. 2021లో రాసినా ఫలితం దక్కలేదు. ముచ్చటగా మూడోసారి 2022 సివిల్స్ మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినప్పటికీ ఇంటర్వ్యూ కాల్ అందుకోలేకపోయాడు. ఇలా దాదాపు మూడు సార్లు విఫలమైనా నిరాశ చెందకుండా ప్రయత్నిస్తూ వచ్చాడు. చివరకు నాలుగోసారి 2023వ సంవత్సరంలో ప్రయత్నించిన అతడికి ఆలిండియా లెవల్‌లో 770వ ర్యాంకు సాధించి ఔరా అనిపించాడు.



### రోజుకు 8 నుంచి 10 గంటలు చదివాను..

ఐఏఎస్ సాధించాలనే బలమైన కోరికతో కష్టపడి చదువుకుంటూ వచ్చాను. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ 10వ తరగతి నుంచి ఎంఏ ఎకనామిక్స్ వరకు నా ఉన్నత చదువులు పూర్తిచేశాను. డిగ్రీ అర్హత ఉంటేనే సివిల్ సర్వీసెస్ పరీక్ష రాయడానికి అర్హత ఉంటుంది కాబట్టి కష్టపడి చదువుతూ 2020లో డిగ్రీ పూర్తిచేసి, 2022లో ఎంఏ ఎకనామిక్స్ పూర్తి చేశాను. ఒకవైపు ఎంఏ చదువుకుంటూనే 2020వ సంవత్సరం నుంచి సివిల్స్ రాశాను. మూడు సార్లు విఫలమైనా నిరుత్సాహ పడలేదు. 2018వ సంవత్సరం నుంచి ఐఏఎస్ సాధించడానికి సాధనను మొదలుపెట్టాను. నాలుగో ప్రయత్నంలో 770వ ర్యాంకు వచ్చింది. దీంతో ఐపీఎస్, ఐఆర్ఎస్ సర్వీస్‌కు అవకాశం వచ్చింది. కానీ నా టార్గెట్ ఐఏఎస్. మున్ముందు మరోసారి సివిల్స్ పరీక్షలను రాసి ఇంకా మంచి ర్యాంకును సాధించి ఐఏఎస్ తప్పకుండా ఎంపికవుతాను. నన్ను ఉన్నతచదువులు చదివించిన తల్లిదండ్రులు, విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల, కళాశాల అధ్యాపకులకు, కోచింగ్ గైడ్ నిపుణులకు ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు.

-మహ్మద్ అష్ఫక్